
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 64.282 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 64.282 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1008 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4000 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.88,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,035
3 శాతం జీఎస్టీతో..	రూ.8,276
నవర (8 గ్రా)	రూ.66,208

గరిష్ఠం/కనిష్ఠం
33.2 /24.5

వాతావరణం

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఏఎన్‌ఎం గ్రేడ్-3ల సీనియారిటీ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్లు కల్పించేందుకు తయారు చేసిన రివైజ్డ్ ప్రావిజనల్ సీనియారిటీ జాబితాను (ఎంపిహెచ్‌ఏ-ఎఫ్) విడుదల చేశామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు. ఏపీ.జీవోవి.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఈ సీనియారిటీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 14వ తేదీ సాయంకాలంలోపు తగు ఆధారాలతో సరి చేయించుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 224 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 224 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 4802 మందికి 4658 మంది హాజరయ్యారు. 144 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 4267 మందికి 4187 మంది హాజరయ్యారు. 80 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ శ్రీనివాసులు 4 కేంద్రాలు, డీవీఈఓ మధుబాబు 6 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆక్రమణలను తొలగిస్తాం



ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న కమిషనర్, సీఐ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో రోడ్లపై ఆక్రమణలను తొలగిస్తామని నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ముంబై రోడ్డులో వైఎస్సార్ కూడలి నుంచి మలిదేవి వరకు చెన్నూరు రోడ్డులో ఉన్న ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కువగా ఆక్రమించిన వారి వస్తువులను మున్సిపాలిటీ ట్రాక్టర్లలో స్టేషన్‌కు తరలించారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక ఆక్రమణ తొలగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదేశాలను ధిక్కరించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సుమారు 50 మంది నగర పంచాయతీ సిబ్బంది, 25 మంది వరకు పోలీసు సిబ్బంది ఈ ఆక్రమణ తొలగింపులో పాల్గొన్నారు.

21న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 21వ తేదీన జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయి. ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పుష్పయాగానికి అంకురార్పణ

రాపూరు: పెంచలకోనలో వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి మంగళవారం రాత్రి వేదపండితులు పుష్పయాగానికి అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ మాఘ పౌర్ణమినాడు స్వామివారికి పుష్పయాగం చేయడం దేవస్థాన ఆచారమన్నారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం కార్యక్రమాలు నిర్వహించారు.

కావలిని కుదిపేస్తున్న మనీస్కాం

రూ.200 కోట్ల వరకూ కొల్లగొట్టిన మహబూబ్ సుభాని



- ఇప్పటికే ప్రజల నుంచి రెండొందలకు పైగా ఫిర్యాదులు
- ఆందోళన చెందుతున్న బాధితులు
- కీలకంగా వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- ఏజెంట్లుగా మారిన పోలీసులు, వారి కుటుంబ సభ్యుల పాత్రపై ఉన్నతాధికారుల ఆరా



మహబూబ్ సుభాని

కావలి: కావలి కేంద్రంగా స్టాక్‌మార్కెట్ పేరుతో జరిగిన భారీ మోసం ప్రకంపనలు సృష్టిస్తోంది. గుంటూరుకు చెందిన సుభాని పట్టణ పరిధిలోని ముసునూరులో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల నుంచి కోట్లు కొల్లగొట్టిన విషయం తెలిసిందే. స్టాక్‌మార్కెట్‌లో మెళకువలు, ట్రేడింగ్‌లో శిక్షణ పేరుతో అమాయకులకు వలవేసి, పోలీసు సిబ్బందిని, ప్రభుత్వ ఉద్యోగులను పావులుగా వాడుకుని ఏడాది కాలంలోనే రూ.200 కోట్ల వరకూ కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. స్కాం వెలుగులోకి వచ్చిన తరువాత గడిచిన 48 గంటల్లోనే సుమారు 200 మందికిపైగా బాధితులు కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. కావలి పట్టణంతో పాటు కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాలు, కాలనీల నుంచి బాధితులు తండోప తండాలుగా కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదులు అందజేస్తున్నారు. ఫిర్యాదుదారుల వివరాలు, ఫిర్యాదులోని అంశాలను పోలీసులు ఎక్కడా బయటకు పొక్కనీయకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.



విచారణకు సుభాని నివాస ప్రాంగణంలోకి చేరుకున్న డీఎస్పీ, సీఐలు



సుభాని నివాస ప్రాంగణం ప్రహరీ గేటు తాళం పగులగొడుతున్న పోలీసు

బాధితులు ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ.70 లక్షల వరకూ చెల్లించి మోసపోయారు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న యువత, చిరువ్యాపారులు, చిరుద్యోగాలతో పొట్టపోసుకునే ప్రైవేట్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా భారీగా పెట్టుబడులు పెట్టి నిండా మునిగిపోయారు. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద, ముసునూరులోని సంస్థ కార్యాలయం వద్ద బాధితులు తిండి తిప్పలు మానేసి విలపిస్తున్నారు. సుమారు రూ.40 లక్షల వరకూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన ధనలక్ష్మి అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జరిగిన మోసాన్ని తట్టుకోలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించి ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది. ధనలక్ష్మి తరహాలోనే చాలా మంది బాధితులు ఆత్మహత్యలే గతి అన్నట్లుగా భోరున విలపిస్తున్నారు.

పోలీసుల పాత్రపై ఉన్నతాధికారుల ఆరా...

మనీస్కాంలో కొంత మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కూడా కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత పెట్టుబడి పెట్టేందుకు సుభాని వద్దకు వెళ్లిన కానిస్టేబుళ్లు ఆ తరువాత ఏజెంట్లుగా మారినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సంస్థ ట్రేడింగ్ ద్వారా లాభాలు సాధించడం లేదని, మనీస్కాంకు పాల్పడుతుందని గుర్తించి అందిన కాడికి దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో కానిస్టేబుల్ ఒకరు ఒక సీఐకి, ఎస్సైకి రూ.40 లక్షలు పైచిలుకు వ్యయంతో ఫ్లాట్ కూడా కొనుగోలు చేసి ఇచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పోలీసుల పాత్రపై ఉన్నతాధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న వట్టికాల రాధాకృష్ణ, జ్యోతి అయోధ్య కుమార్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

బాధితుల్లో పెరుగుతున్న ఆందోళన

సుమారు రూ.200 కోట్ల మేర జరిగిన మనీస్కాం విషయంలో దర్యాప్తు సంస్థలు నెమ్మదిగా వ్యవహరిస్తుండటంపై బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వారం రోజులుగా దర్యాప్తు చేస్తున్నా ఇంత వరకూ ఎటువంటి వివరాలు వెల్లడించకపోవడం, ఆస్తులు గుర్తించకపోవడం, అంతా గోప్యంగా సాగుతుండటంతో బాధితులు విలవిలలాడిపోతున్నారు. ఈక్రమంలోనే ధనలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతీ రూపాయి వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని బాధితులు వేడుకుంటున్నారు. నగదు చెల్లించిన వాళ్లు, కమీషన్ ఏజెంట్‌గా వ్యవహరించిన వారు ఉన్నారు. అయితే ఈ దందా నిర్వహించిన సుభాని, ఏజెంట్లు ఎంత స్వాహా చేశారు అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు స్పష్టత ఇవ్వక పోవడంతో బాధితులు కుమిలిపోతున్నారు.

గోప్యంగా సాగుతున్న విచారణ

సుభానిని, కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు గోప్యంగా విచారణ చేస్తున్నారు. ముసునూరులోని సుభాని ఇంటిని, కార్యాలయాన్ని తహసీల్దార్ సమక్షంలో మంగళవారం తెరిచి కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే కీలక పత్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, అకౌంటింగ్‌కు సంబంధించిన కీలక ఆధారాలు, ఏజెంట్ల వివరాలు మాయం చేసినట్లు గుర్తించారు. ట్రేడింగ్, పెట్టుబడుల పేరుతో సుభాని వసూలు చేసింది ఎంత? బాధితులకు తిరిగి చెల్లించింది ఎంత? మిగిలిన సొమ్ము అంతా ఎక్కడ ఉంది? బినామీ పేర్లతో స్థిరాస్తులు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారు, పోలీసులు ఇప్పటి వరకూ ఎంత వరకూ గుర్తించారు అనే వివరాలేవీ బయటకు రావడం లేదు.

మూగజీవాల మౌనవేదన

- పశువైద్యశాలల్లో సరిగా అందని వైద్యం
- పలుచోట్ల వైద్యుల కొరత
- శిక్షణలో ఉన్న విద్యార్థుల చేతే సేవలు

సాక్షి విజిట్

కావలి: కావలి పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న పశువుల ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే వైద్యుడు సమయ పాలన పాటించడం లేదు. ఆస్పత్రికి ఎప్పుడు వస్తాడో, ఎంత సేపు ఉంటాడో కూడా చెప్పలేని పరిస్థితి. సాక్షాత్తూ కావలి డివిజన్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ హోదా అధికారుల కార్యాలయాలు కూడా పశువుల ఆస్పత్రిని ఆనుకునే ఉంటాయి. అంటే ఉన్నతాధికారుల కార్యాలయాల చెంతనే ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యుడు విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరంటే ఆ శాఖలో పరిస్థితికి అద్దం పడుతోంది.

కావలిలోని ప్రభుత్వ పశు వైద్యశాల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటలు వరకు సేవలు అందిస్తుందని ఆస్పత్రి ప్రాంగణంలోని గోడకు కాగితం అంటించారు. అయితే మూగ జీవాలకు వైద్య సేవలు అందించే వైద్యుడు మాత్రం ఆ సమయ వేళల్లో ఉండరు. సాక్షి మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు కావలి పట్టణంలోని పశువుల ఆస్పత్రిలో గమనించగా, అక్కడ జరుగుతున్న తంతు విస్తుపోయేలా ఉంది.

వింజమూరులో వేళలు పాటించరు

వింజమూరు: వింజమూరు పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న పశువైద్యశాలను మంగళవారం 'సాక్షి' విజట్ చేసే సమయంలో (8.45 గంటల) తలుపులు తీశారు. ఈ వైద్యశాలలో సహాయ సంచాలకులు, పశుగణ సహాయకులుతో పాటు కార్యాలయ సబార్డినేట్ ఉన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వహించాలి. కానీ సబార్డినేట్ తలుపులు తీసి వెళ్లిపోయారు. 9.30 గంటల వరకు ఎవరూ రాలేదు. వైద్యశాలలో అన్ని కుర్చీలు ఖాళీగా దర్శనం ఇచ్చాయి. విధి నిర్వహణలో వేళలు పాటించకపోవడంతో పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు.

మాచవరంలో పశువైద్యాధికారి లేరు

కందుకూరు రూరల్: మండలంలోని మాచవరం పశువైద్యాధికారి పదోన్నతిపై వెళ్లడంతో ఆ పోస్టులో పశు వైద్యులను నియమించలేదు. ఇన్‌చార్జి వైద్యాధికారిగా కోవూరు పశువైద్యశాలకు చెందిన వైద్యులు ఎస్.సుధాకర్‌ను నియమించారు. రెండు వైద్యశాలలను ఆయనే చూస్తున్నారు. ప్రతి సచివాలయంలో పశువైద్య అసిస్టెంట్లు ఉండగా వైద్యుల సూచనల మేరకు పశువైద్యం అందిస్తున్నారు. అత్యవసరం సమయంలో వైద్యులకు సమాచారం అందిస్తే వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. పర్మినెంట్ పశువైద్యాధికారిని నియమించాలని మాచవరం పశుపోషకులు కోరుతున్నారు.



కుక్క కరిచిన కోడి పుంజుకు ఇంజెక్షన్ వేస్తున్న శిక్షణ విద్యార్థి



జ్వరం వచ్చిన మేక పిల్లకు ఇంజెక్షన్ చేస్తున్న దృశ్యం

కోడి పుంజును కుక్క కరిసింది..

ఉదయం 10 గంటల సమయంలో పట్టణంలోని బుడంగుంట కాలనీ నుంచి పగడం శ్రీనివాసులు అనే వ్యక్తి తాను పెంచుకుంటున్న కోడి పుంజును తీసుకొని వచ్చాడు. ఆస్పత్రిలో వైద్యుడు లేరు. అయితే ఇంటర్న్‌షిప్ కోసం శిక్షణలో ఉన్న విద్యార్థి కోడి పుంజు తెచ్చిన వ్యక్తి వద్దకు చేరుకుని ఏమైందని ఆరా తీశాడు. కుక్క కరవడంతో కోడి పుంజు మెత్తపడిందని చెప్పడంతో ఆ విద్యార్థి ఇంజక్షన్లు వేసి పంపాడు.

మేక పిల్లకు జ్వరం..

ఉదయం 10.30 గంటలకు ముసునూరు నుంచి వారం రోజుల మేక పిల్లను సంకలో పెట్టుకుని పొట్లూరు శ్రీనివాసులు అనే వ్యక్తి వచ్చాడు. ఇంటర్న్‌షిప్ కోసం శిక్షణలో ఉన్న విద్యార్థి సదరు వ్యక్తిని పలకరించడంతో మేక పిల్లకు జ్వరం వచ్చిందని చెప్పాడు. దీంతో థర్మామీటర్‌తో మేక పిల్లను పరీక్షించి ఇంజక్షన్‌లు వేశాడు.

కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెం గ్రామానికి చెందిన యోగేందర్ డిప్లామా ఇన్ వెటర్నరీ చేసి, రెండేళ్ల నుంచి కావలి పట్టణంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. యోగేందర్‌కు ప్రభుత్వం జీతం రూపంలో పైసా ఇవ్వదు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకునే వైద్యుడు మాత్రం మూగ జీవాలే కదా.... ఎవరికీ చెప్పుకోలేవనే ధీమాతో ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది తేటతెల్లమౌతోంది.

ఉత్తమ పర్సంటైల్ సాధన

- జేఈఈ మెయిన్స్ ఫలితాలు వెల్లడి

నెల్లూరు (టౌన్): ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 7వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్షల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కె.పూర్వజ్ 99.98, కె.మధుకిరణ్‌రెడ్డి 99.93, బి.భానురిషిక్ 99.92, ఎం.అఖిలేష్ 99.91 పర్సంటైల్‌ను సాధించారు.

ఉత్తమ ఐఐటీలో చేరడమే లక్ష్యం



నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్ భానురిషిక్ స్వస్థలం. తండ్రి బొమ్మన రమణయ్య, తల్లి ఉమామహేశ్వరి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఉత్తమ కళాశాలలో ఐఐటీ చదవడమే లక్ష్యంగా చెబుతున్నారు.

– భానురిషిక్

సాఫ్ట్‌వేర్‌గా పనిచేయాలని ఉంది



కె.పూర్వజ్‌ది నెల్లూరులోని బ్రహ్మదేవం స్వస్థలం. తండ్రి కె.రమేష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి శ్రీవల్లి గృహిణి. అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించి బాంబే ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేయాలన్నదే లక్ష్యం.

– కె.పూర్వజ్

బాంబే ఐఐటీలో చేరాలన్నదే లక్ష్యం



ఎం.అఖిలేష్‌ది తమిళనాడులోని నామకల్ స్వస్థలం. తండ్రి మాదీశ్వరన్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తల్లి శశికళ గృహిణి. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో కూడా ఉత్తమ ర్యాంకు సాధించి బాంబే ఐఐటీలో చదవాలన్నదే లక్ష్యంగా చెబుతున్నారు.

– ఎం.అఖిలేష్

పాఠశాల విలీనాన్ని ఒప్పుకోం

- బోడిపాడు స్కూల్ ఎదుట తల్లిదండ్రుల నిరసన

చేజర్ల: ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలను ఇతర పాఠశాలల్లో విలీనం చేస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చేజర్ల మండలంలోని బోడిపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను చేజర్ల మెయిన్ పాఠశాలలో విలీనం చేయనున్నారని తెలియడంతో మంగళవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన ప్రదర్శన చేశారు. తమ గ్రామంలోని పాఠశాల తరగతులను చేజర్ల పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇళ్లు కూల్చివేస్తే రోడ్డున పడతాం

- విడవలూరు గ్రామస్తుల నిరసన
- రోడ్డుపై బైఠాయించిన మహిళలు

విడవలూరు: విడవలూరు గ్రామంలోని బుచ్చి-ఊటుకూరు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలో ఉన్న గృహాలను ఈనెల 18న తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆర్ అండ్‌బీ స్థలంలోని ఇళ్లకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. అయితే తమ ఇళ్లను తొలగించవద్దని, ప్రత్యామ్నాయం చూపిన తరువాతే చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లు కోల్పోయే వారిలో ఎక్కువ మంది పేద ప్రజలే ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో మా ఇళ్ల చుట్టూ తిరిగి ఓట్లు అడిగి వేయించుకున్న నాయకులు ఇప్పుడు మేం రోడ్డున పడుతుంటే కనీసం మా తరఫున నిలబడి మాకు భరోసా కల్పించకపోవడం దారుణమన్నారు.

తల్లిని కాపాడేందుకు...

- నీటిలో దూకిన తనయుడు
- ఈత రాక మునిగిపోయి మృతి
- శంకరనగరంలో విషాదం



ఆకాష్ (ఫైల్)

సోమశిల: పేద కుటుంబంలో సంతోష ఘడియలు వస్తున్న సమయంలో అనుకోని విషాదం చోటుచేసుకుంది. అనంతసాగరం మండలంలోని శంకరనగరం గ్రామానికి చెందిన చెందిన ఉప్పలపాటి కొండయ్య, శోభ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం పశువుల మేత కోసం శోభ, ఆమె కుమారుడు ఆకాష్ (21) సమీపంలోని కొమ్మలేరు వాగు వద్ద గడ్డి కోస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు శోభ కాలుజారి వాగులో పడిపోయింది. గమనించిన ఆకాష్ తల్లి నీటిలో కొట్టుకుపోవడం చూసి రక్షించేందుకు వాగులోకి దూకాడు. అయితే ఆకాష్‌కు ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. తల్లి శోభ ప్రాణాలతో సమీపంలోని ఓ గట్టుకు చేరింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు వాగు వద్దకు వెళ్లి ఆకాష్ మృతదేహాన్ని వెలికి తీసి ఇంటికి తీసుకువచ్చారు. ఆకాష్ ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేశాడని, ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకు నీట మునిగి మరణించడంతో కుటుంబ సభ్యులు గుండె పగిలేలా రోదిస్తున్నారు.



ఆకాష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

అగ్రిగోల్డ్ భూముల్లో వీరప్పన్లు

కొనసాగుతున్న ఎర్ర చందనం నరికివేత

- అనుమతి లేని ఎర్రచందనం దుంగలు ఎక్కడికి తరలిస్తున్నారు?
- కలప అక్రమ రవాణాపై అటవీశాఖ ఏం చేస్తోంది
- సూత్రధారులు, పాత్రధారులను పట్టించుకోని పోలీసులు
- పట్టించుకోని రెవెన్యూ, సీఐడీ, అటవీశాఖాధికారులు

ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు వీరప్పన్‌ను మించిపోతున్నారు. అగ్రిగోల్డ్ సంస్థ భూముల్లో రూ.కోట్ల విలువ చేసే కలప దోపిడీకి తెగబడుతున్నారు. ఇప్పటి వరకు జామాయిల్ కర్రను నరికి రవాణా చేస్తున్నారు. తాజాగా ఆ భూముల్లోని అత్యంత విలువైన ఎర్రచందనం చెట్లు నరికేస్తున్నారు. అయితే వీటిని ఎవరి అనుమతి మేరకు ఎక్కడికి తరలిస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎర్రచందనం చెట్లు హార్వెస్టింగ్ చేయాలంటే అటవీశాఖ అనుమతి అవసరం. వీరి అనుమతి లేకుండా హార్వెస్ట్ చేసిన ఎర్రచందనంతోపాటు అటవీశాఖ పరిధిలోని ఎర్రచందనం కూడా తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తూర్పుదూబగుంటలో జేసీబీతో ఎర్రచందనం మొదళ్లు తొలగించిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పేదల కష్టార్జిత సొమ్ముతో అగ్రిగోల్డ్ సంస్థ ఉదయగిరి నియోజకవర్గంలో కొనుగోలు చేసిన భూముల్లోని సంపద పచ్చనేతల పాలు అవుతోంది. అధికారం అండతో ఆ పార్టీ నేతలు వీరప్పన్లుగా మారి ప్రైవేట్ సంస్థ భూముల్లోని ఎర్ర చందనం అక్రమంగా నరికి రవాణా చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎర్రచందనం యథేచ్ఛగా తరలిపోతుందంటే పోలీస్, అటవీశాఖ, సీఐడీ శాఖలపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రచందనం చెట్లు హార్వెస్ట్ చేయాలన్నా.. రవాణా చేయాలన్నా అటవీశాఖ అనుమతి అవసరం ఉంది. వీరి అనుమతి లేకుండానే తరలిపోతుందంటే.. జిల్లాలో అటవీశాఖ పరిధిలోని ఎర్రచందనం అక్రమ రవాణాపై కూడా ఆ శాఖ నిఘా లేదని స్పష్టమవుతోంది.

కలిగిరి మండలంలోని తూర్పుదూబగుంట, తెల్లపాడు గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. తెల్లపాడులో సుమారు 450 ఎకరాల్లో జామాయిల్ సాగులో ఉంది. తూర్పుదూబగుంటలోని 750 ఎకరాల్లో మామిడి, ఉసిరి, టేకు, ఎర్రచందనం మొక్కలు సాగులో ఉన్నాయి. అగ్రిగోల్డ్ సంస్థ మీద సీఐడీ కేసులు, కోర్టు కేసుల నేపథ్యంలో ఆ భూములు సీజ్ చేసి ఉన్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విలువైన అగ్రిగోల్డ్ భూములు, ఆస్తులను కాపాడుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే, అనుచరులు, మండల స్థాయి నాయకుల కన్ను విలువైన అగ్రిగోల్డ్ ఆస్తుల్లోని విలువైన సంపదపై పడింది. ప్రస్తుతం అగ్రిగోల్డ్ భూముల్లో వందల కోట్ల రూపాయల విలువ చేసే జామాయిల్, ఎర్రచందనం, టేకు మొక్కలు ఉన్నాయి. వాటిని కొట్టి అక్రమార్జనకు తెరలేపారు. తూర్పుదూబగుంటలోని అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న ఎర్రచందనం మొక్కలను యంత్రాలను కూలీల సహాయంతో నరికి తరలిస్తున్నారు. విషయం బయటకు పొక్కడంతో గత నెల 28వ తేదీన పోలీసులు 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నామమాత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎర్రచందనం స్మగర్లు కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన కూలీల సహాయంతో యంత్రాల ద్వారా ఎర్రచందనం దుంగలను నరికారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టడం లేదు. పోలీసులు ఎర్రచందనం చెట్లను నరికిన కూలీలను అదుపులోకి తీసుకుని విచారణ చేపడితే ఈ విషయంలో ఉన్న సూత్రదారులు, పాత్రదారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఉన్నత స్థాయిలో ఒత్తిడి రావడంతోనే పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



స్మగర్లు నరికివేసిన ఎర్రచందనం మొదళ్లు

ఆనవాళ్లు తొలగింపు

అగ్రిగోల్డ్ భూముల్లోని 20కి పైగా ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు యంత్రాల సహాయంతో నరికివేసి తరలించారు. గత నెల 28వ తేదీ ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసిన స్మగర్లు, కూలీలు పరారయ్యారు. అక్కడ ఉన్న 5 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్ని ఎర్రచందనం దుంగలు నరికివేశారో తెలియకుండా ఉండేందుకు స్మగర్లు జేసీబీ సహాయం ఆనవాళ్లను తొలగించారు. నరికివేసిన చెట్ల మొదళ్లను సైతం తొలగించారు. ఇప్పటికే స్మగర్లు తరలించిన ఎర్రచందనం దుంగల విలువ రూ. కోట్లల్లో ఉంటుందని సమాచారం.

కన్నెత్తి చూడని రెవెన్యూ, సీఐడీ అటవీశాఖ అధికారులు

తూర్పుదూబగుంటలో ఎర్రచందనం, తెల్లపాడులో జామాయిల్ చెట్లను అక్రమంగా నరికివేస్తున్నప్పటి రెవెన్యూ, సీఐడీ, అటవీశాఖ అధికారులు ఆ వైపు చూడడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే అగ్రిగోల్డ్ భూముల్లో రూ. కోట్ల విలువ చేసే కలప అక్రమంగా నరికేతకు గురవుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సీఐడీ అధికారులు రంగంలోకి దిగి మొత్తం వ్యవహారంలో కీలకపాత్ర వహిస్తున్న మాఫియా డాన్, స్మగ్లర్లు, సూత్రదారులు, పాత్రధారుల ఆటకట్టించాలని అగ్రిగోల్డ్ డిపాటిజ్‌దారులు, ఏజెంట్లు, ప్రజలు కోరుతున్నారు. పరిస్థితి ఇలాగా కొనసాగితే కొద్ది రోజుల్లోనే అగ్రిగోల్డ్ భూముల్లోని విలువైన సంపద మొత్తం మాయం అయ్యే ప్రమాదం ఉంది.

క్లుప్తంగా

ఆరుగురు బైండోవర్

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ చర్యల్లో భాగంగా రౌడీ, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. నేరాలకు పాల్పడే అవకాశమున్న వారిని, అనుమానాస్పద వ్యక్తులను బైండోవర్‌లు చేస్తున్నారు. మంగళవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్నబజారు ఎస్‌ఐ సీవీ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న సస్పెక్ట్ షీటర్లు నవాబుపేట కుసుమదళితవాడకు చెందిన బి.కన్నయ్య, మూలాపేట రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌కు చెందిన షేక్ కరిముల్లా, షేక్ ఆషిద్, షేక్ షాహీదా, రౌడీషీటర్లు కుసుమదళితవాడకు చెందిన ఎం.మల్లి, మూలాపేట రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్‌కు చెందిన షేక్ సిద్దిఖ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. మొత్తం 93 మంది విద్యార్థులకు 91 మంది హాజరయ్యారని తెలిపారు.

ట్రక్ ఆటోను కారు ఢీకొని చిరు వ్యాపారి దుర్మరణం



ఘటనా స్థలంలో శ్రీనివాసులు మృతదేహం

మనుబోలు: ట్రక్ ఆటోను కారు ఢీకొనడంతో ఓ చిరువ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మడమనూరుకు చెందిన ఉప్పు శ్రీనివాసులు (35) ట్రక్ ఆటోలో కూరగాయలు, వివిధ రకాలు పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు మంగళవారం వేకువజామున ఆటోలో నెల్లూరు బయల్దేరాడు. కొండూరుసత్రం సమీపంలో వెనుక నుంచి కారు వేగంగా ఢీకొనడంతో శ్రీనివాసులు ఆటోతోపాటు ఎగిరి పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివరాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 112
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 145



నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.18



గాయపడిన మాజీ ఎంపీపీ మృతి



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలచంద్రప్రతాప్

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మాజీ ఎంపీపీ అడపాల బాలచంద్రప్రతాప్ (75) మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మనుబోలు అంబేడ్కర్ నగర్‌కు చెందిన బాలచంద్ర ప్రతాప్ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేందుకు వైఎస్సార్ సర్కిల్ వద్ద హైవే దాటుతున్నాడు. ఆ సమయంలో నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ట్రక్ ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని 108 అంబులెన్స్‌లో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

50 శాతం సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ సామాజిక వర్గాల్లోని కుమ్మర/శాలివాహన, మేదర కులాలకు సంబంధించిన వారు కుండలు, వెదురు బుట్టలు తయారీ చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా, సహకార సంఘం లిమిటెడ్ అధికారి డాక్టర్ నిర్మలాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ–ఏ గ్రూపునకు చెందిన 50 మంది లబ్ధిదారులకు రూ.1.50 కోట్లు, బీసీ–బీలో మరో 50 మందికి రూ.1.50 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ పథకానికి సంబంధించి 3 నుంచి 5 మంది గ్రూపు సభ్యులకు యూనిట్ ఖరీదు రూ.3 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో 50 శాతం సబ్సిడీ మిగతా 50 శాతం బ్యాంకు లోనుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు తమ ఆధార్, రేషన్, ఆదాయ, కుల సర్టిఫికెట్లతో ఏపీఓబీఎంఎంఎస్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో మంగళవారం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ, వీఎస్‌యూ, ఎన్‌ఐసీ సంయుక్త ఆధ్వర్యంలో సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఇంటర్నెట్ ఆన్‌లైన్ వినియోగంతో ప్రయోజనాలతోపాటు, సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయని వివరించారు. నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఇంటర్నెట్ అనేది మన జీవన గమనంలో ఒక భాగంగా మారిందన్నారు. ఓటీపీ, డెబిట్, క్రెడిట్, కార్డుల సీవీవీ నంబర్లు, వ్యక్తిగత పాస్‌వర్డ్‌లు, యూజర్ ఐడీలు అత్యంత భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలను పలుసార్లు ధ్రువీకరించుకున్న తర్వాతనే చేయాలని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా సులభంగా డబ్బులు వస్తాయని ఆశ పడే యువత సైబర్ మోసాల బారిన పడుతున్నారన్నారు. ఎన్‌ఐసీ సమాచార అధికారి సురేష్‌బాబు సైబర్ మోసాలపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఫేక్ వెబ్‌సైట్లు, వాట్సప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సదస్సులో వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



మండపం పంచాయతీలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

తోటపల్లిగూడూరు: భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని జేసీ కే కార్తీక్ సూచించారు. మండలంలోని మండపం పంచాయతీలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని జేసీ కార్తీక్ మంగళవారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ భూముల హద్దుల విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో ప్రభుత్వం ఈ భూసర్వే కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు. రైతుల మధ్య విభేదాలు తలెత్తకుండా సరైన కొలతతో వారి భూములకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో జరిగిన రీ సర్వేలో దొర్లిన చిన్నపాటి తప్పిదాలను సవరించేందుకు ఈ రీసర్వే దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్,డీటీ శివయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి.సత్యవాణి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి సత్యవాణి

బుచ్చిరెడ్డిపాళెం: జిల్లాలో 297 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి.సత్యవాణి తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీపై బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు రైతు సేవా కేంద్రంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. సత్యవాణి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల దగ్గర నుంచి అభ్యర్థనలు వస్తున్నాయన్నారు. 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. గతేడాది ఓపెన్ మార్కెట్లో పుట్టి ధాన్యం రూ.21 వేల నుంచి రూ.24 వేల వరకు రేటు ఉందన్నారు. ధరలు తగ్గినట్లయితే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవచ్చునని తెలియజేశారు. నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా రైతుల ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో కొనుగోలు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సురేంద్రరెడ్డి, స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మందుబాబుల నిలువు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): మద్యం ధరల పెంపును సాకుగా చూపిస్తూ వైన్ షాపులు, బార్ల యజమానులు మందుబాబులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వార్టర్ మద్యంపై రూ.10 పెంచుతూ మంగళవారం జీఓ జారీ చేసిన విషయం విదితమే. పెరిగిన ధరలు బుధవారం నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చాయి. పెరిగిన ధరల పట్టికలను దుకాణాల వద్ద ప్రదర్శించాల్సి ఉండగా వాటికి తిలోదకాలిచ్చిన వ్యాపారులు క్వార్టర్‌పై రూ.10, ఫుల్‌పై రూ.40 వసూలు చేస్తున్నారు. బీర్ల ధరలు పెరగనప్పటికి పలు దుకాణాల్లో వీటిపై అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక బార్ల యజమానుల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇష్టానుసారంగా ధరలు పెంచి మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారు. వ్యాపారులు నిర్ణీత ధరలకంటే అదనంగా వసూలు చేస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ధరల పెంపు విషయమై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రభుత్వ నిర్దేశిత ధరల మేరకే మద్యం విక్రయాలు సాగించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని చెప్పారు. ప్రతి వ్యాపారుడు విధిగా పెరిగిన ధరల పట్టికను దుకాణం వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు.

పదివేల ఇంకుడు గుంతలు

- డ్వామా పీడీ గంగాభవాని



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు(పొగతోట): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పది వేల ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. మంగళవారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం శనివారం ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రూ.6 వేలతో ఒక్కొక్క ఇంకుడు గుంత నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ ఇప్పటికే 7 వేల ఇంకుడు గుంతలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించి రెండు రోజుల్లోపు అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యానికి మించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఏడో తరగతి చదువుతున్న బాలికపై లైంగికదాడికి పాల్పడిన పోక్సో కేసులో మంగళవారం నెల్లూరురూరల్ పోలీసులు కామాంధుడితోపాటు అతడికి సహకరించిన స్నేహితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నెల్లూరు రూరల్ మూడోమైలులో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాల ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న సతీశ్ మాయమాటలు చెప్పి కొత్తకోడూరు బీచ్‌కు తీసుకెళ్లి రెండు దఫాలుగా లైంగిక దాడి చేసిన ఘటన గత నెల 29వ తేదీన జరిగిన విషయం విదితమే. ఈ కేసులో కామాంధుడు సతీశ్, అతనికి సహకరించిన స్నేహితులు కోవూరు సునీల్, సునీల్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. మంగళవారం ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.